
సౌమ్యగిరి ఆధ్యాత్మిక ఝరి

సౌమ్యగిరి.. పేరులోనే **క్షేత్ర మహిమను** చాటే పుణ్యక్షేత్రం. ఉగ్ర**నరసింహుడు** శాంతించిన ప్రాంతంగా **పౌరాణిక** ప్రాశస్త్యం. సింహాచలం **కంటే పురాతనం.** చారిత్రక ఆధారాలుగా **దర్శనమిచ్చే** శాసనాలు .. ఇలా ఎన్నో **విశిష్టతల** సమాహారం ఈ ఆలయం. **ఈ క్షేత్రం** వైశిష్ట్యాన్ని గుర్తించిన **వైఎస్సార్‌సీపీ** ప్రభుత్వం రూ.75 లక్షల**తో కొండపైకి** రహదారి నిర్మించడం**తో భక్తులకు** మరింత చేరువైంది. **ముక్కోటి ఏకాదశిని** పురస్కరించుకుని మ**హిమాన్విత క్షేత్రం** విశేషాలివి..

- ఉగ్ర నరసింహుడు శాంతించిన ప్రాంతం
- భీమిలిలో అత్యంత పురాతన క్షేత్రం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.75 లక్షలతో రోడ్డు మార్గం


లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, (ఇన్‌సెట్)అలంకరణలో స్వామి

భీమునిపట్నం: భీమిలి సౌ**మ్యగిరిపై కొలువుదీ**రిన లక్ష్మీ నరసింహస్వామి **దేవాలయం అత్యం**త పురాతనమైందిగా గుర్తిం**పు పొందింది. హిర**ణ్యకశిపుడిని సంహరించిన తరువాత కూడా ఉగ్రరూపంలో ఉన్న నరసింహస్వామిని **చూసి** ప్రహ్లాదుడు శాంతించమని ప్రార్థించగా **ఆయన** ఈ కొండపైనే శాంత రూపాన్ని దాల్చారని, అందుకే దీనికి సౌమ్యగిరి అని పేరు వచ్చిందని చెబుతారు. దానికి ప్రతీకగా ఈ కొండపై ఆలయం వెలసిందని పురాణాలు చెబుతున్నాయి. ఇది సింహాచలం దేవాలయం కన్నా పురాతమైనదిగా పేర్కొంటారు. ఆదిశంకరాచార్యులు ఈ ఆలయాని**కి** పంచలోహ విగ్రహాన్ని అందించారు. **అయితే,** 1990 దశకంలో ఈ విగ్రహంతో మరో **రెండు** విగ్రహాలు చోరులపాలయ్యాయి. కృతయుగంనాటిదిగా చెప్పే ఈ ఆలయం శాలివాహనుల కాలంలో బయటపడింది. ఇక్కడ స్వామివారి విగ్రహం శాంతరూపంలో ఉంటుంది. ఇంకా క్రీ.శ. 1225లో శాలివాహన కాలం నాటి శిలా శాసనాలు కూడా ఉన్నాయి. వీటిపై ఆలయ విశిష్టత లిఖించి ఉంది.


ఆలయం వద్ద శాలివాహన కాలం నాటి శిలా శాసనాలు

ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక

ఈ ఆలయానికి ఆంధ్ర, తెలంగాణా, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వస్తుంటారు. శ్రీకాకుళం జిల్లా, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల నుంచి పూర్వం వంద సంవత్సరాల పైనుంచే చాలా మంది భక్తులు ఎడ్లబండ్లపై ఈ ఆలయానికి యాత్రకు వచ్చేవారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని, తలనీలాలు సమర్పించి తిరిగి వెళ్లేవారు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతోంది. అయితే ఎడ్లబండ్లకు బదులు మోటారు వాహనాల్లో వచ్చి వెళుతున్నారు.

వైకుంఠ ఏకాదశికి సన్నాహాలు

ఈ నెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారుజామున 2గంటల నుంచి స్వామివారికి పంచామృత, ఫలరస, నదీ జలాలు, దివ్య ఔషధాలతో అభిషేకాలు, అలంకరణ జరుగుతాయి. అనంతరం వేకువజామున 3.30 గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పిస్తారు. ఉచిత ప్రసాద వితరణ జరుగుతుంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో కొండపైకి రోడ్డు నిర్మాణం

గతంలో కొండ పైకి సరైన మార్గం లేకపోవడంతో వృద్ధులు, భక్తులు మెట్లు ఎక్కలేక ఎంతో ఇబ్బంది పడేవారు. అంతకు ముందు ప్రభుత్వాలు ఎన్నో హామీలు ఇచ్చినా నెరవేరలేదు. ఆ తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భక్తుల కల నెరవేరింది. శతాబ్దాల నాటి ఆలయం విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటనే స్పందించారు. కొండపైకి రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేశారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం చకచకా జరిగింది. 2022 ఏప్రిల్‌లో మార్గం అందుబాటులోకి వచ్చింది. అన్ని వాహనాలు పైకి వెళ్లే సదుపాయంతో పాటు విశాలమైన పార్కింగ్ ప్రదేశం కూడా ఉండడంతో వాహనదారులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొండపైకి నిర్మించిన సిమెంట్ రోడ్డు

వ్యూ అద్భుతం

కొండపై నుంచి వ్యూ అద్భుతంగా ఉంటుంది. సుందర సాగర తీరం.. చుట్టూ పచ్చని గిరులు.. సువిశాల నగర ప్రాంతం సందర్శకులను ఆకట్టుకుంటాయి.



ఎంతో ప్రాశస్త్యం గల ఆలయం



ఈ ఆలయం ఎంతో ప్రాశస్త్యం గలది. స్వామి వారు శాంతరూపంలో కొలువుదీరారు. ఇక్కడి వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఇప్పుడు కొండపైకి మార్గం కూడా ఏర్పాటవడంతో భక్తులకు సౌలభ్యంగా ఉంటోంది. ఆలయానికి మరికొన్ని సదుపాయాలు అవసరం. కల్యాణ మండపం, పార్కింగ్ ప్రదేశంలో మరుగుదొడ్లు నిర్మించాలి. కొండ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించి మంచి మొక్కలు పెంచాలి. ఆమేరకు ప్రభుత్వం సహకరించి చర్యలు తీసుకోవాలి.

– రొంపిచర్ల సింగరాచార్యులు, వంశపారంపర్య ప్రధాన అర్చకులు

క్లుప్తంగా

కేజీబీవీలో ఆడిట్ బృందం తనిఖీ


విద్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సోషల్ ఆడిట్ బృందం మంగళవారం తనిఖీ చేసింది. బృందం సభ్యులు నాగరాజు, పోలినాయుడు, శివప్రసాద్ తదితరులు రికార్డులు, ల్యాబ్, గ్రంథాలయం, వంటగది మొదలైనవి పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. అన్నీ సరిగ్గా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అంజనీసుతుడికి తమలపాకుల అలంకరణ



తగరపువలస: అంజనీ సుతుడు తమలపాకుల అలంకరణలో దర్శనమిచ్చారు. మజ్జివలసలో స్వామికి ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు.

పూర్వ అర్చకులను కొనసాగించాలి


అర్చక సంఘానికి వినతిపత్రం అందిస్తున్న భక్తులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో 40 ఏళ్ల నుంచి అర్చకత్వం చేసిన గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి వారసులను కొనసాగించాలని స్థానిక భక్తులు, అయ్యప్ప స్వామి మాలధారులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్య ప్రైవేట్ బ్రాహ్మణ అర్చక సంఘానికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 2009లో మిల్లు లాకౌట్ తరువాత ఆలయ బాధ్యతలతో పాటు పంచముఖ ఆంజనేయస్వామి, షిర్డీసాయిబాబా ఆలయా లు, నవగ్రహాలు, సుబ్రమ్మణ్యస్వామి విగ్రహాలను దాతల సాయంతో నరసింహమూర్తి నిర్మించి ఈ ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారన్నారు. అలాంటి ఆయన వారసులకు బ్రాహ్మణ, అర్చక సంఘాలు అండగా నిలవాలని కోరామన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు ఆహ్వానం

పద్మనాభం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని మద్దిలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్న కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ తెలిపారు. విశాఖ, విజయనగరం జిల్లాల్లోని ఆసక్తి గల టీమ్‌లు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనదలిచే క్రీడాకారుల వయసు 25 ఏళ్ల లోపు ఉండాలని, వారు తమ సొంత గ్రామం తరఫున మాత్రమే ఆడాలని తెలిపారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. ప్రతీ టీమ్ రూ.300 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. మొదటి మూడుస్థానాల్లో నిలిచే బృందాలకు వరుసగా రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొన దలిచే టీమ్ లు 73370 29978, 70931 51873 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగురాలికి వితరణ


దివ్యాంగురాలికి సరకులు అందిస్తున్న సంఘం సభ్యులు

పద్మనాభం: పాండ్రంగిలో దివ్యాంగురాలు అముజూరి ముత్యాలమ్మకు రేవిడి శ్రీనివాస యువజన సేవా సంఘం సభ్యులు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, మాజీ అధ్యక్షుడు పతివాడ ఇంద్రరావు, మరగడ చిరంజీవి, ఒమ్మి పైడినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ పండగలు మన సంప్రదాయానికి ప్రతీకలన్నారు. అనంతరం వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో..


బంగ్లామెట్ట పాఠశాలలో సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తగరపువలస: గ్రామీణ వాతావరణంలో సంప్రదాయ వేషధారణలో బంగ్లామెట్ట పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమైక్యతా సంబరాలు ఆకట్టుకున్నాయి. కోడిపుంజులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు, రంగోలీ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్యాలు, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. వేడుకలలో ఉపాధ్యాయులు నవీన్, రామలింగం, రామకృష్ణ, రమేష్, సంజీవి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణకు స్పందన నిల్


వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

మధురవాడ: విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) మధురవాడ విశాఖ జోన్-3 కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు కనీస స్పందన కానరాలేదు. ఏపీ డిస్కమ్స్ వార్షికాదాయ అవసరాలు, విద్యుత్ రిటైల్ ధరల ప్రతిపాదనలపై మూడు రోజుల పాటు విద్యుత్ శాఖ వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులో భాగంగా మధురవాడ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒక్కరు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఇక కార్యాలయంలోనూ ఒక ఆపరేటర్, ఏఈ తప్ప ఇతర అధికారులెవరూ లేకపోవడం కొసమెరుపు. 8, 10తేదీల్లోనూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. అయితే ఈ కార్యక్రమం గురించి అధికారులు సరైన ప్రచారం చేయలేదనే విమర్శలు ఉన్నాయి.

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

- వేకువజాము నుంచి ఉత్తర ద్వార దర్శనాలు


రుషికొండ టీటీడీ ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, టెంట్లు

కొమ్మాది: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సర్వదర్శనాలు ఉంటాయన్నారు. వీవీఐపీ, వీఐపీ, డోనార్స్ దర్శనాలు తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఆ రోజు సుమారు 50 వేల నుండి 60వేల వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇస్కాన్‌లో ఏడు ద్వారాల దర్శనం

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఈ నెల పదో తేదీన ఏడు ద్వారాల ద్వారా ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వేకువజామున 4.30 గంటల నుండి 5.30 గంటల వరకు స్వామి దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. బ్రేక్ అనంతరం ఉదయం 7.30 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి వారి దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శ్రీ బాలాజీ, పద్మావతులుగా శ్రీ రాధా దామోదరులకు ప్రత్యేక అలంకరణ, పుష్పాభిషేకం, వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతపై సాంబదాస్ ప్రభూజీ ప్రవచనాలు, భజనలు, కీర్తనలు ఉంటాయని పేర్కొన్నారు.

మొగదారమ్మ ఆలయంలో...

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సాగర్‌నగర్‌లోని మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ఉదయం 5గంటల నుండి రాత్రి 9 గంటల వరకు విశేష అర్చనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ఆలయ ధర్మకర్త ఎస్.లక్ష్మీ ప్రసాద్ తెలిపారు.

'వారిజ'లోని హయగ్రీవ మందిరంలో..

బీచ్ రోడ్డు వారిజ ఆశ్రమంలోని హయగ్రీవ మందిరంలో ఆరోజు ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలు ప్రారంభం అవుతాయని ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు.

ప్రజానాట్యమండలి నూతన కార్యవర్గం

తగరపువలస: ప్రజానాట్యమండలి భీమిలి జోన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా దల్లి రాంబాబు, అధ్యక్షుడిగా పోతురాజు, ప్రధాన కార్యదర్శిగా బెల్లాన రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిల్ల అప్పారావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా పంపాన సూర్యనారాయణ, కమిటీ సభ్యులుగా ఎస్.ఉమ, ఎస్.లక్ష్మి, రమణ, గంగయ్యలను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


తగరపువలస: భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 10న విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. 12న స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ


ప్రసంగిస్తున్న గీతం ఇన్‌చార్జి వీసీ గౌతమరావు

కొమ్మాది: ఐటీ, పారిశ్రామిక రంగాల్లో మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా అధ్యాపకులకు వీటిపై నైపుణ్యం అవసరమని గీతం ఇన్‌చార్జి వీసీ గౌతమరావు అన్నారు. గీతంలో ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మెషీన్ లెర్నింగ్ ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్, సైబర్ సెక్యూరిటీ అల్గారిథమ్స్ అనే అంశాలపై అధ్యాపకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంజినీరింగ్ విద్యలో అన్ని కోర్సుల్లోనూ మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ అంశాలను బోధిస్తున్న నేపథ్యంలో అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా ఈ అంశాలపై లోతైన పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు.

జాబ్‌మేళాలో 38 మంది ఎంపిక


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్లేస్‌మెంట్ అధికారి రమేష్‌నాయుడు

భీమునిపట్నం: నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని భీమిలిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 102మంది పాల్గొనగా 38మంది ఎంపికయ్యారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నో కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని, అర్హులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి నెలా ఈ జాబ్‌మేళా ఉంటుందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆయా ప్రాంతాలవారు దీన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా రంగోత్సవ్ పోటీలు


విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న జ్యోతికుమారి

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా రంగోత్సవ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 150మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం బయటపడుతుందన్నారు. జిల్లాస్థాయిలో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

క్విజ్ పోటీల్లో నడుపూరు విద్యార్థులు, జానపద నృత్యాలు, రోల్‌ప్లే పోటీల్లో ఆరిపాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు ప్రథమస్థానంలో నిలిచారు. చిత్రలేఖనంలో పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థిని, డిజిటల్ పోస్టర్ పోటీలో నడుపూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని, దస్తూరి పోటీల్లో భీమిలి కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులు ప్రథమస్థానాల్లో నిలిచారు. ఇక్కడ ఎంపికైన వారు ఈ నెల 24న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు ప్రిన్సిపాల్ ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఎస్.త్రినాథరావు, జె.మాధవి, ఎం.మహాలక్ష్మి, సోమయాజులు, నీలిమ పాల్గొన్నారు.

పేదలకు సంక్రాంతి కానుకలు


సంక్రాంతి కానుకలు అందిస్తున్న శిష్టకరణాల సంఘం ప్రతినిధులు

తగరపువలస: విశాఖ శిష్టకరణాల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంతో పాటు ఆనందపురంలో సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. 50 మంది పేదలకు 50వేల రూపాయలు విలువ చేసే బట్టలు, నిత్యావసర సరకులు, స్వీట్లు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శిష్టకరణాల సంఘం అధ్యక్షుడు అరికతోట చంద్రమౌళి, శిష్టకరణాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కంటిమహంతి అనూషా పట్నాయిక్, రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు మంత్రి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్‌కె మహంతి, ప్రధాన కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి, కోశాధికారి డి.హరనాథ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జేసీఎల్‌కు చిట్టివలస కార్మిక సంఘాల వినతి


జేసీఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం ఇవ్వవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఐక్యకార్మిక సంఘాల ప్రతినిధులు జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావును కోరారు. మంగళవారం ఆయన్ను కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదు చేసుకున్న వారితో పాటు నమోదు చేసుకోని కార్మికులకు కూడా నష్టపరిహారం, గ్రాట్యుటీ, పీఎఫ్ వెంటనే చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అప్రెంటిస్ కార్మికులకు యాజమాన్యం ఇవ్వవలసిన బకాయిలు చెల్లించాలన్నారు. కార్మికులందరికీ పూర్తి చెల్లింపులు చేసేవరకు ఆస్తులు ఆన్‌లైన్‌లో కూడా విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీఎల్‌ను కలిసిన వారిలో మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మద్దుల దేవుళ్లు, నరవ రామారావు, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవకు సుగంధ ద్రవ్యాలు, జలం తీసుకువెళ్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాన్ని అనుసరించి ముందు గా వచ్చిన మంగళవారం ఈ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుగంధ ద్రవ్యాలతో శ్రీవారి ఆలయం, హనుమాన్, మహాలక్ష్మి, గోదాదేవి ఆలయాలను శుద్ధి చేసిన అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులకు సర్వదర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిషోర్, శ్రావణ్, ఆలయ అర్చకులు, టీటీడీ పండితులు పాల్గొన్నారు.